IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)
An International Open Access, Peer-reviewed, Refereed Journal

# హిందూ వివాహం – ప్రాముఖ్యత -నేటి పరిస్థితి

**డా||ఆర్. కుసుమ కుమారి, ఎం.ఎ; ఎం.ఫిల్; పిహెచ్.డి; డి.లిట్ (గోల్డ్ మెడలిస్ట్)**
**తెలుగు సహాయ ఆచార్యులు (HOD),**
**డా||వి.యస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ&పి.జి. కళాశాల (స్వ) విశాఖపట్నం.**

**పరిచయం:** హిందూ ధర్మశాస్త్రం ప్రకారం పుట్టిన ప్రతి మనిషికీ నలబై రకాల "సంస్కార కర్మలు" అంటే చేయవలసిన విధులు ఉంటాయి. మనిషి పుట్టినప్పటినుంచీ చనిపోయేదాకా ఆచరించే ఈ కర్మలని శ్రుతి, స్మృత్యాదులు 'ధర్మం' గా నిర్ణయించారు. ప్రతి మనిషీ నిర్వహించవలసిన కర్మలని (డ్యూటీస్) నాలుగు రకాలుగా విభజించారు. 1) సంస్కార కర్మలు 2) నిత్యకర్మలు 3) నైమిత్తి కర్మలు 4) కామ్య కర్మలు. ఈ కర్మ కాండలన్నీ హిందూ విశ్వాసంలో ముఖ్యమైనవే. అయితే దేశ కాల పరిస్థితుల దృష్ట్యా పై కర్మలన్నిటినీ మనిషి ఆచరించలేకపోతున్నా బారసాల, నామకరణం, ఉపనయనం, వివాహం మొదలైనవాటిని ఆచరిస్తూనే ఉన్నాడు.

సాంఘిక పరిస్థితులలో ఎలాంటి మార్పులు సంభవించినా, 'వివాహం' అనే సాంప్రదాయక పద్ధతికి మాత్రం ఆదరణ ఈ నాటికి తగ్గకపోవడాన్ని బట్టే దానికి మానవ జీవితంతో విడదీయరాని సంబంధం ఉందని అర్థమవుతోంది. మనిషి జీవితంలో నాలుగు ముఖ్యమైన దశలున్నాయి. అవి

## బాల్యం - కౌమారం - యవ్వనం – వార్ధక్యం:

బాల్యంలో పసితనపు కేరింతలూ, కౌమారంలో అన్నీ తెలుసుకోవాలనే జిజ్ఞాసా, యవ్వనంలో అనుభవాల ఆరాటం, వార్ధక్యంలో ఆవిరైన అనుభూతుల జ్ఞాపకాలు ఇవి మనిషి జీవన విధానం. ఈ నాలుగు దశల్లోనూ యవ్వనంలో మనిషి తనకి తోడుగా మరో మనిషిని తెచ్చుకునే పరిణామమే 'పరిణయం' లేదా 'వివాహం' గా మార్పు చెందిందని చెప్పవచ్చు.

రుగ్వేద కాలంనించీ ఏర్పడిన వివాహవ్యవస్థ మనిషి జీవితంలో గార్హస్య దశ ఎంత ముఖ్యమైనదో తెలియచేస్తోంది. వివాహం గార్హస్య జీవితానికి అతిముఖ్యం. గృహస్థుగా మగవాడు ఆచరించవలసిన కర్మలన్నిటికీ భార్య అవసరం. అంటే హిందూ మతంలో యజ్ఞయాగాది క్రతువులూ, షోడకర్మలూ, పుట్కర్మలూ, నిత్య నైమిత్తిక కర్మలూ, వ్రతాలూ, నోములూ ఇవన్నీ అంతర్భాగాలే వీటన్నిటి లక్ష్యం ఒక్కటే... అదే "పురుషార్థ సాధన".

"పురుషార్థ సాధన"...అంటే సాధించవల్సిన లక్ష్యం. ప్రతి మనిషి చతుర్విధ పురుషార్థాలని సాధించాలి. అవి ధర్మం-అర్థం-కామం-మోక్షం. వీటిలో మోక్షం పరలోకానికి సంబంధించింది. కాబట్టి మొదటి మూడింటినీ 'త్రివర్గం' అంటాం. "వివాహం" త్రివర్గాలైన ధర్మార్థ కామములని సాధించేందుకు అనువైన వ్యవస్థగా చెప్పారు. "మోక్షం" సిద్ధించాల్సిన భాగ్యంగా వర్ణించారు. మనిషి జీవితంలో పురుషార్థ సాధనకి అనువుగా నాలుగు దశలని విభజించారు. 1) బ్రహ్మచర్యం 2) గార్హస్యం 3) వాన ప్రస్థం 4) సన్యాసం.

మనిషి బాల్యంలో విద్య నేర్చుకోవాలి యవ్వనంలో గృహస్థుగా మారాలి వార్ధక్యంలో మునిలా బ్రతకాలి - చివరికి సవ్యసించి యోగసాధనతో ఆఖరిశ్వాసని విడవాలి. ఇలా- చతుర్విధ పురుషార్థ సాధనలో రెండవదైన గార్హస్యసిద్ధికి "వివాహం" తప్పనిసరి. "వివాహం శారీరక వాంఛలనీ, మానసికమైన అవసరాలనీ తీర్చేది మాత్రమే కాదు - సామాజిక బాధ్యతలతో తమ పిల్లలకి పూజా వస్తువులనీ బాధ్యతలనీ నిర్ణయించేది కూడా" అని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డా॥ వెస్తర్ మార్క్ చెప్పాడు. పాశ్చాత్య జీవన విధానంలో వివాహం అనేది కేవలం స్త్రీ, పురుషుల "సంబంధాన్ని" ప్రస్తావిస్తోంది. అయితే-భారతీయ వివాహ వ్యవస్థలో ముఖ్యమైన ఉద్దేశ్యం "ధార్మికమైనది". మానవ నాగరికా పరిణామ క్రమాన్ని జాగ్రత్తగా గమనిస్తే సంస్కృతీ ప్రభావం వల్లనే "వివాహ వ్యవస్థ" మొదలైందని స్పష్టమవుతోంది. "క్రీస్తు పూర్వం 10,000 సంవత్సరాల నుంచీ అంటే కొత్తరాతియుగంనించీ "వివాహ వ్యవస్థ" మొదలైందని చెప్పవచ్చు. ఆదిమానవుడు పశువులని పెంచడం, పంటలని పండించడం నేర్చుకున్న దశలోనే 'వివాహం' అనే శాశ్వత బంధాన్ని అమల్లోకి తెచ్చినట్టు పరిణామ క్రమం చెబుతోంది" అని "స్టోరీ ఆఫ్ సివిలైజేషన్" అనే పుస్తకంలో సామాజిక పరిణామ సిద్ధాంతకర్త "విల్డ్యూరాంట్" చెప్పాడు.

**వివాహం-రకాలు:** పెళ్ళంటే స్త్రీ, పురుషులు ఒకరినొకరు జీవితాంతం తోడూ నీడగా ఉండేందుకు ఏర్పరచిన సామాజికమైన కట్టుబాటు. అటువంటి కట్టుబాటు ఋగ్వేదంలోని వివాహ సూక్తంలో వివాహ ధర్మాన్ని గురించి మనోజ్ఞంగా వర్ణించబడి ఉంది. అలాంటి వివాహాలు 8 రకాలు అవి:

**1) బ్రాహ్మము**: కన్యను బాగా విలువైన ఆభరణాలతో అలంకరించి, కన్యాదాత, సత్ప్రవర్తనుడైన వరుని పూజించి కన్యాదానం చేయటం.

**2) దైవము:** యజ్ఞం చేసేటప్పుడు ఆ పురోహితుడినే దైవంగా భావించి అతడికి అలంకరించిన కన్యనిచ్చి పెళ్ళిచేయడం.

**3) ఆర్షము**: వరుడినించి ధర్మార్థముగా ఒకటి రెండు జతల ఆవులని తీసుకుని బదులుగా కన్యనిచ్చి వివాహం జరిపించడం.

**4) ప్రాజాపత్యము:** స్త్రీ పురుషులిద్దరూ ధర్మ నిర్వహణ కోసం ప్రమాణం చేసి పెళ్ళి చేసుకోవడం. 5) అసురము: వధువు తరుపు వారికి గానీ లేదా వధువుకే గానీ తగినంత ధనం ఇచ్చి పెళ్ళాడటం.

**6) పైశాచకం:** నిద్రలో లేదా తాగిన మైకంలో, అపస్మారకంలో ఉన్న కన్యను ఎత్తుకుపోయి శీలాన్ని హరించి బలవంతంగా చేసుకునే పెళ్ళి.

**7) రాక్షసం:** కన్య బంధువులని దౌర్జన్యంగా కొట్టి, చంపి, ఆమె ఇష్టం లేదని ఏడుస్తున్నా బలాత్కారంగా ఎత్తుకుపోయి పెళ్ళాడటం.

**8) గాంధర్వం:** వధూవరులిద్దరూ ఒకరినొకరు ఇష్టపడినా పెద్దలు అనుమతించకపోతేనో లేదా పరిస్థితులు అనుకూలించక పోతేనో స్వతంత్రించి పెళ్ళి చేసుకోవడం అంటే ఇవాళ్టి 'ప్రేమ వివాహం' లాంటిది.

ప్రతి మనిషి పుట్టక చేతనే మూడు ఋణాలతో పుడతాడని వేదం చెబుతోంది. ఈ మూడు ఋణాలు మానవునికి ఆ జన్మ ఋణాలు. 1) దేవ ఋణం, 2) ఋషి ఋణం, 3) మాతాపితృ ఋణం.

యజ్ఞయాగాది క్రతువులతో దేవతారుణం బ్రహ్మచర్యంతో ఋషి రుణం-వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సేవతో పితృఋణం తీరుతుంది. అందుకే వేద కాలానికే 'వివాహ వ్యవస్థ' బలపడింది.

**వివాహం- ఉద్దేశ్యం:** ఆడదానికైనా, మగవాడికైనా పెళ్ళి చేసుకోవడానికి ముఖ్యమైన కారణాలు మూడే 1) వివాహమనే కట్టుబాటుతో, ప్రేమ భావనతో కడదాకా ఒకరికొకరు తోడుగా ఉండడం 2) లైంగిక వాంఛను తీర్చుకొన. 3) కుటుంబ వ్యవస్థ ద్వారా నైతిక విలువలని కాపాడుతూ, సామాజిక భద్రతనీ, గౌరవాన్నీ పొందడం.

## ప్రకృతి సహజమైన వివాహంలో ముఖ్యాంశాలు:

**1) పెళ్ళిచూపులు:** కాబోయే వధూవరులు పరస్పరం ఒకరినొకరు చూసుకోవటానికీ, తమ జీవిత భాగస్వామిని అంగీకరించేందుకు అనువైన వేదికగా పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తారు.

**2) నిశ్చయతాంబూలాలు:** వధూవరులు ఒకరికొకరు నచ్చాక, పెద్దలు మాట్లాడుకున్నాక ఓ మంచి రోజు పురోహితుని సమక్షంలో పెళ్ళి ముహూర్తాన్ని నిర్ణయించుకుని లగ్నపత్రికని రాయించుకుని లగ్న పత్రికలనూ తాంబూలాలనీ పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటారు. దీనినే 'నిశ్చితార్థం' అంటారు.

**3) స్నాతకం:** అన్ని రకాల ప్రాయశ్చిత్తాలకోసం, శరీర శుద్ధికోసం పెళ్ళికొడుకు చేత గోత్రనామాలతో, విఘ్నేశ్వర పూజ అబ్బాయి ఇంట్లోకాని, మండపంలో కాని పురోహితుడు చేయిస్తాడు.

**4) కాశీయాత్ర:** కాళ్ళకి పాదుకలు, తలపై గొడుగు, చేతిలో కర్ర, మెడలో పసుపు గుడ్డతో వరుడు మేళతాళాల మధ్య కాశీయాత్రకు బయలుదేరతాడు. అప్పుడు వధువు సోదరుడు వచ్చి వరుని చేయి పట్టుకుని నా సోదరినిచ్చి మీకు వివాహం చేస్తాను అని బొట్టుపెట్టి, నూతన వస్త్రాలు పెట్టి పెళ్ళికి ఆహ్వానిస్తాడు.

**5) వరపూజ - ఎదుర్కోళ్ళు:** కన్యాదాత ఎదురెళ్ళి పానకం బిందెలు, కొత్తబట్టలతో సుస్వాగతం చెబుతాడు. వరుని చేత పానకం తాగించి, వరుని తల్లిదండ్రులతో, బంధువులతో సహా పెళ్ళికి ఆహ్వానిస్తారు.

**6) గౌరీ పూజ:** వధువు పది కాలాలపాటు పసుపు కుంకుమలతో వర్ధిల్లాలని అమ్మాయి చేత గౌరీపూజ జరిపిస్తారు.

**7) మంగళ స్నానాలు:** వధువురులిద్దరూ పరిశుభ్రంగా స్నానం చేసి గౌరీ పూజ, విఘ్నేశ్వర పూజ చేస్తారు.

**8) కన్యావరణం:** తన వివాహార్థం ముఖ్యులైన బంధుమిత్రులని వరుడు వధువు దగ్గరికి పంపుతాడు. తనని పెళ్ళి చేసుకోవలసిందిగా వాళ్ళద్వారా వధువుకి కబురు పెడతారు.

**9) మధుపర్కాలు:** పెళ్ళికి విచ్చేసిన వరుడికి పెరుగు, నెయ్యి, తేనె కలిపి తాగించి కన్యాదాత నూతన వస్త్రాలని ఇస్తాడు. వీటినే మధుపర్కాలు అంటారు.

**10) యజ్ఞోపవీతధారణ:** కన్యాదాత వెండితో చేసిన జంధ్యం పోగుని పూజించి వరుడికి ప్రధానం చేస్తాడు.

**11) మహా సంకల్పం:** వధూవరులిద్దరూ పీటల మీద ఎదురెదురుగా కూర్చొని శ్రీమహావిష్ణువుని తలచుకుని జన్మజన్మల పాపాలు పోవాలనీ పుణ్యలోకాలు ప్రాప్తించాలనీ వాంఛిస్తూ అలంకరించబడిన కన్యని దానం చేసేందుకు కన్యాదాత సంకల్పం చెబుతాడు.

**12) బాసికము:** మానవుని శరీరంలోని నాడులలో ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులు ముఖ్యమైనవి. వీటిలో సుషుమ్న అనే వాడికి కుడివైపు సూర్యనాడి, ఎడమవైపు చంద్రనాడి ఉంటాయి. ఇవి రెండూ కలిసే చోటు ముఖంలోని భ్రూమధ్యం. దీనిపై ఇతరుల దృష్టి దోషం పడకుండా వధూవరులకు ఈ

స్థానాన్ని కప్పడానికి భ్రూమధ్యం. దీనిపై ఇతరుల దృష్టి దోషం పడకుండా వధూవరులకు ఈ స్థానాన్ని కప్పడానికి బాసిక ధారణ చేస్తారు.

**13) అడ్డుతెర:** తెల్లని వస్త్రం మీద సుగంధ ద్రవ్యాలతో 'శ్రీ స్వస్తిక్' ముద్రలతో రాసిన తెరను వధూవరుల మధ్యన పట్టుకుంటారు. దీని భావం వరుడు పరమాత్మ. వధువు జీవాత్మ. మధ్య నుండే తెరమాయ. జీవాత్మకి పరమాత్మ దర్శనం కావాలంటే మధ్య నుండే మాయ అనే తెర తొలగాలి. సుముహూర్త సమయంలో ఆ తెర తొలగిస్తారు. ఒకరినొకరు చూస్తారు.

**14) కాళ్ళు కడగటం/కన్యాదానం:** వరుడి కాళ్ళని కన్యాదాత కడుగుతుంటే కన్యాదాత భార్య మూడుసార్లు నీళ్ళు పోస్తుంది. దీనినే కాళ్ళుకడిగి కన్యాదానం చేయడం అని వ్యవహరిస్తుంటాం.

**15) జీలకర్ర-బెల్లం:** బ్రహ్మరంధ్రం మామూలుగా మూసుకొని ఉంటుంది, జీలకర్ర బెల్లం యొక్క మిశ్రమాన్ని బ్రహ్మరంధ్రంపై ఉంచటం వల్ల అది తెరుచుకుంటుంది. వధూవరులు ఒకరి తలపై మరొకరు ఉంచిన చేతుల ద్వారా వారి శక్తి జీలకర్ర బెల్లం యొక్క మిశ్రమం ద్వారా బ్రహ్మరంధ్రంలోకి ప్రవేశించి ఆ క్రిందుగా ఉన్న సహస్రార చక్రం ద్వారా భ్రూమధ్యంలో ఉన్న ఆజ్ఞాచక్రం ద్వారా వెలువడి ఒకరినొకరు ఆకర్షించుకొంటారు. ఒకరి తలలని ఒకరు తాకటంతో వాళ్ళ మధ్య 'స్పర్శ' మొదలవుతుంది. ఇదే జీలకర్ర బెల్లంలోని పరమార్థం.

**16) కాళ్ళు తొక్కించడం:** అప్పటిదాకా 'స్పర్శ' తెలియని ఇద్దరు ఆడా మగలు సుమూహూర్తంతో తలలని స్పృశించుకున్నాక పాదాలతో ఒకరినొకరు తాటించుకోవడంతో వాళ్ళమధ్య కొత్తదనం పోవాలని దీని ఉద్దేశ్యం.

**17) స్వర్ణ జలాభిమంత్రణం:** వధువు తలమీద బండికాడి ఉంచి ఆ కాడి రంధ్రంలో బంగారాన్ని పెట్టి కన్య తలమీద బంగారాన్ని తాకేలా జలంతో అభిషేకం చేస్తారు. ఇలా చేయడం వలన పవిత్రజల స్పర్శచే వధువుకి ఏవైనా దోషాలుంటే అవన్నీ పోయి శుభం కలుగుతుందని నమ్మకం.

**18) యోక్త్ర బంధనం:** “మంచి మనసుతో చక్కటి సంతానాన్ని, సౌభాగ్యాన్ని కల్గించాలని" అంటూ దర్భలతో పేనిన తాడుని వధువు నడుం చుట్టూ చుట్టి ముడేస్తాడు వరుడు.

**19) మంగళ సూత్రధారణ:** తాళిబొట్లు రెండింటిలోను ఒకటి పుట్టింటివారిది, ఒకటి మెట్టింటివారిది. ఈ రెండు బొట్టులు ఆమె హృదయంపై మోస్తూ ఇటు పుట్టింటి వృద్ధిని, అటు మెట్టినింటి వృద్ధిని, సర్వకాల సర్వావస్థలయందు హృదయమున చురువక మేలగునట్లు ఆ వివాహిత స్త్రీ హృదయమున ఈ మాంగల్యం రెండూ మెరుస్తూ ఉంటాయి. అటువంటి మాంగల్యంను వరుడు వధువు మెడలో కట్టి మూడు ముళ్ళు వేస్తాడు. "నా జీవితానికి కారణమైన ఈ సూత్రంతో నేను నీ మెడలో మాంగల్యం అనే ఈ బంధంను కడుతున్నాను" అని అంటూ కడతాడు. ఇక మూడు ముళ్ళు కట్టడానికి కారణం ప్రతి వ్యక్తికీ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడు ఉంటాయి. ఈ మూడు శరీరాలకు మూడు ముళ్ళు వేస్తాడు. వరుడు, స్థూల శరీరం పోయినా, మిగిలిన రెండు శరీరాలకు కూడా ముడివేశాడు. కాబట్టి, భర్త స్థూల శరీరం పోయినా తరువాత కూడా అతడే భర్త అగును. తరువాత ముడులకు పసుపు, కుంకుమ పూస్తారు.

**20) అక్షింతలు తలంబ్రాలు:** క్షత: అంటే విరుడునది. అక్షత అంటే విరుగనిది. అనగా విడదీయరాని బంధం గలది అని భావం. బియ్యం చంద్రుడికి సంకేతం, చంద్రుడు మన కారకుడు, వధూవరుల మనోభీష్టిని సుస్థిరపరిచే శక్తిని సిద్ధింపచేయడానికి, తెల్లని బియ్యానికి పసుపు కలిపి అక్షింతలుగా వాడతారు. పసుపు యాంటిబయోటిక్గా పనిచేస్తుంది. వధూవరులకు చర్మవ్యాధులు రాకుండా ఈ పసుపు కాపాడుతుంది. వరుడు చేతిలో తలంబ్రాలు పోసుకొని "సమాజ శ్రేయస్సు కుటుంబవృద్ధి కాంక్షించే ఉత్తమ

సంతానాన్ని అందివ్వమని" దోసిలి ఎత్తి తలంబ్రాలు పోస్తాడు. దానికి అంగీకారంగా వధువు వరుడు తలపై పోస్తుంది.

**21) బ్రహ్మముడి:** పెళ్ళిలో వరుడి ఉత్తరీయాన్నీ, వధువు చీరకొంగునీ కలిపి ముడివేస్తారు. దీనిని త్రిమూర్తుల స్వరూపంగా కేంద్రముడిగా భావిస్తారు. దీనినే "కొంగులు ముడివేయడం" గా వ్యవహరిస్తారు. ప్రేమ, అన్యోన్యతలతో పార్వతీ పరమేశ్వరుల్లాగా చిరకాలం సుఖించండి అని దీవిస్తారు.

**22) ఉంగరాలు తీయడం:** మూతి కురచగా ఉండే బిందెలో పాలు, నీళ్ళూ కలిపి నిండాపోస్తారు. ఆ బిందెలో ఒకే ఒక్క బంగారపు ఉంగరాన్ని వేస్తారు. పురోహితుడు చెప్పగానే వధూవరులిద్దరూ గభాల్న కురచగా ఉన్న మూతిలోంచి బిందెలోకి చేతిని తోసి నీళ్ళలో పడిన ఉంగరాన్ని బయటికి తీయాలి. ఎవరి చేతికి చిక్కితే వారికి ఎదుటివారు ఆ ఉంగరాన్ని వేలికి తొడగాలి. ఈ చర్యతో 'స్పర్శ' తాలూకు 'సాన్నిహిత్యం' అప్పటి దాకా పరిచయంలేని వధూవరుల మధ్య క్రమంగా బిడియాన్ని పోగొడుతుంది. సరదాల సరసాల మధ్యే పోటీపడి గెలవాలనే పట్టుదలనీ, అంతలోనే తను ఓడిపోయి ఎదుటి మనిషిని గెలిపించాలనే ప్రేమ భావననీ చిగురింపచేస్తుందీ అంశం.

**23) పాణిగ్రహణం:** వరుడు తన కుడిచేతిలో వధువు కుడిచేతిని సమంత్రకంగా పట్టుకోవడమే పాణిగ్రహణం, పాణిగ్రహణం వలన వధూవరులిద్దరిలో ప్రవహించే విద్యుత్ ప్రవాహం కలుస్తుంది. ఇద్దరి మనోభావాలు ఒకటౌతాయి.

**24) సన్నికల్లు తొక్కడం:** వధువుని ధైర్యంగా ధృఢంగా ఉండాలని చెప్తుందీ అంశం. అగ్నిహోత్రానికి ఉత్తరం వైపు సన్నికల్లుని ఉంచుతారు. భర్త మాట మేరకు వధువు తన కాలుని సన్నికల్లు మీద ఉంచి నిలబడుతుంది. ఆ రాతిమీద నిలబడి ధృఢంగా, స్థిరంగా ఉండి శత్రువులని పాదాలతో అణిచేసే శక్తిని సమకూర్చుకోమని వరుడు చెప్తాడు.

**25) సప్తపది:** వధూవరులు అగ్నిహోత్ర సమక్షంలో సమంత్రకంగా ఏడడుగులు కలిసి నడుస్తారు. దాని వలన ఏర్పడే 'ప్రాప్తపదీన సఖ్యము' జీవితాంతం వెల్లివిరుస్తుంది. అన్న వృద్ధికి, బలవృద్ధికి, ధనవృద్ధికి, సుఖ వృద్ధికి, ప్రజాపాలనకి, దాంపత్య జీవనానికి, సంతానవృద్ధికి ప్రతీకలుగా ఈ ఏడడుగులని చెప్తారు.

**26) ప్రధాన హోమం**: హిందూ వివాహ సంప్రదాయాల్లో ప్రధాన హోమం చాలా కీలకమైంది. దంపతులు ఒకరినొకరు తాకుతూ భక్తిఓ హోమం చేస్తారు. భర్తను భార్య, భార్యను భర్త ఎడమ, కుడి చేతులతో నడుములని తాకాలి.

**27) లాజ హోమం**: పెళ్ళిలో చేయించే హోమాల్లో లాజ హోమం కూడా ముఖ్యమైనదే. వధువుచేత తన భర్తకి ఆయురారోగ్యాలు, చక్కటి సంతానం కలగాలని సోదరుడు తోడుగా ఉండగా చెప్పిస్తూ పేలాలను హోమం చేయిస్తారు. అగ్ని చుట్టూ వధూవరులు ప్రదక్షిణాలు చేశాక వధువు నడుంచుట్టూ కట్టినటువంటి యోక్త్ర బంధనాన్ని విప్పదీస్తారు.

**28) నాగవల్లి/నల్లపూసలు కట్టడం:** వధువుకి బంధువులు చీరలూ, సొమ్ములూ పెడతారు. తొమ్మిది మట్టిపిడతల్లో నవధాన్యాలు పోసి ఎనిమిది దిక్కుల్లో ఎనిమిదీ, మధ్యన ఒకటీ ఉంచుతారు. దంపతులు వివిధ దేవతలని పూజిస్తారు. వరుడు వధువుకి ఎదురుగా నిలబడి ఆమె మెడలో నల్లపూసలు కడతాడు. మాంగల్యంతో ముడిపడ్డ ఇద్దరి బంధం నల్లపూసలు కట్టడంతో మరింతగా బలపడుతుంది.

**29) మెట్టెలు**: కాలి బొటన వేలు పక్కనున్న వేలు స్త్రీలకు ఆయువుపట్టు వంటిది. దాని నుంచి విద్యుత్తు ప్రసరిస్తూ ఉంటుంది. కాబట్టి ఆ వేలు నేలకు తగలడం మంచిదికాదు. అలా తగలకుండా ఉండటానికే మెట్టెలు ధరించే సంప్రదాయం ఏర్పడింది.

**30) సదస్యం**: సదస్సులు అంటే పెళ్ళికి లేదా సభకి విచ్చేసిన వాళ్ళని అర్థం. ఈ అంశంలో గణపతిపూజ, దిక్పాలకుల పూజ, సరస్వతి పూజ చేశాక వధూవరులు పెద్దలకి తాంబూలాలిచ్చి వారి ఆశీస్సులు పొందుతారు.

**31) అరుంధతీ దర్శనం:** ధ్రువ నక్షత్రం నాశనం లేని నివాసం కలది. నాశనం లేని గమనం కలది. ఇతర నక్షత్రాలు కూడా స్థిర పథాన్ని పొందేందుకు మార్గదర్శకాలు, అరుంధతీ నక్షత్రం ఆధారంగా చేసుకొని కొన్ని ఇతర నక్షత్రాలు తిరుగుతాయి. అలాగే భర్త ఇంటిలో వధువు స్థిరంగా ఉండి మార్గదర్శకురాలిగా ఉండాలని భావం.

**32) స్థాలీపాకం**: ఈ అంశంతో వాళ్ళ గృహస్థ్య జీవనం మొదలవుతుందని చెప్పుకోవచ్చు. వధువు చేత ధాన్యం దంపించి, బియ్యం బాగుచేయించి, ఓ చిన్న గిన్నెలో పిడికెడు బియ్యం పోసి అగ్నిమీద అన్నం ఉడికించేలా సహాయపడతాడు భర్త. వరుడు పెళ్ళితో ఓ ఇంటివాడయ్యాడు. కాబట్టి అతిథులని సేవించడానికి భార్యతో కలిసి వంట చేయించటం ఇక్కడ గమనించదగ్గ విషయం.

**33) ఉయ్యాల-బొమ్మని అప్పచెప్పటం:** ఈ అంశంతో వధువు వరుడి తాలూకు కుటుంబీకులతో సాన్నిహిత్యంగా మెలిగే అవకాశం కలుగుతుంది. ఆడపడుచుకు బొట్టు పెడుతుంది నవవధువు. ఆమె ఉయ్యాలలో ఓ చెక్క బొమ్మ(ఎర్ర చందనం బొమ్మ)ని పెట్టి ఊపుతూ "పాడి ఆవునిస్తావా, పడుచునిస్తావా" అని వధువుని అడుగుతుంది. దానికామె అలాగే వదినమ్మా అని బొమ్మను ఆడపడుచు చేతిలో పెడుతుంది. కొత్త కోడలికీ ఆడపడుచులకీ మధ్య సఖ్యత ఉండాలని ఈ అంశం తెలియజేస్తుంది.

**34) అంపకాలు:** దీనినే అప్పగింతలు అంటారు. ముద్దు ముచ్చట్లు మధ్య పెంచుకున్న బంగారు తల్లిని మరో ఇంటికి పంపించే దృశ్యం కరుణరసపూరితమైనది. పిల్లవాడి తల్లికీ, తండ్రికీ అంటే పిల్ల అత్తమామలకి ఆమెని అప్పగించడం. మా పిల్లని జాగ్రత్తగా చేసుకోండని అభ్యర్థిస్తారు. వధూవరులు అందరికీ నమస్కరించి వీడ్కోలు చెప్తారు. పిల్ల అత్తవారింటికి బయల్దేరుతుంది.

**35) గృహ ప్రవేశం:** భార్యతో వరుడు తొలిసారిగా తన ఇంట్లోకి అడుగుపెట్టటాన్నే గృహ ప్రవేశం అంటారు. తర్వాత ఏ శుభకార్యానికైనా చేయదగిన సత్యనారాయణ వ్రతాన్ని మనసారా ఆచరించి తన ఇంట్లో భార్యతో కలసి వరుడు పెద్దల దీవెనలు పొందుతాడు.

**36) కంకణ విమోచనం:** పెళ్ళిలో ముంజేతికి కట్టిన కంకణాన్ని విప్పడంతో వివాహ ప్రక్రియ పూర్తవుతుంది.

**37) గర్భదానం:** దీనినే వాడుక భాషలో 'ఫస్ట్ నైట్' లేదా 'తొలిరాత్రి' గా అభివర్ణిస్తారు. పెళ్ళిలో వివిధ ఘట్టాలలో సిగ్గు, బిడియం, కొత్తదనం కొద్ది కొద్దిగా పోయాక వాళ్ళని మానసికంగా, మంత్రబద్ధంగా 'ఒకటి' గా చేసిన పెద్దలే ఓ సుముహూర్తాన 'గర్భదానం' ఏర్పాటు చేస్తారు. సాధారణంగా ఇది వధువు ఇంట్లో జరుగుతుంది. పెళ్ళిలో ఏర్పడిన సాన్నిహిత్యం గర్భదానంతో శారీరక బంధంగా రూపుదిద్దుకుంటుంది. శరీరాలతో మొదలైన 'స్పర్శ' మానసికంగా మారి ఒకరిమీద ఒకరు ఆధారపడేలా చేస్తుంది.

**38) పదహారు రోజుల పండుగ:** దీనినే 'వడికట్టు బియ్యం' అని కూడా అంటారు. పెళ్ళిలో వధువు నడుంకు కట్టిన బియ్యంను పెళ్ళి అయిన పదహారు రోజులకు అబ్బాయి వారింట్లో ఆ బియ్యంతో పాయసం చేసి ఇష్టదైవానికి నైవేద్యంగా పెట్టి వధూవరులిద్దరూ పూజిస్తారు. తర్వాత వధూవరులతో పాటు ఇంట్లో వాళ్ళు నైవేద్యాన్ని తింటారు. ఈ కార్యక్రమంతో మొత్తం పెళ్ళితంతు అంతా పూర్తి అయినట్లుగా భావిస్తారు.

**ముగింపు:** ఎవరో తెలియని ఒక ఆడ, ఒక మగను ఇరువర్గాల వారు వారిద్దరిని ఏకం చేయడమే 'వివాహ బంధం' వారిద్దరూ కలిసి జీవించడమే దాంపత్య బంధం. మరి మనం ఈరోజు చూస్తే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా అదృశ్యమైపోయి 'వ్యక్తిగత జీవన విధానం' మొదలయ్యాక మనిషిలో 'స్వార్ధం' పెరిగిపోయింది. ఇన్నివేల సంవత్సరాల చరిత్ర ఉన్న వివాహ వ్యవస్థలో ఎన్నో మలుపులు-మరెన్నో మార్పులు, మనకి తెలియకుండానే మనం ఆ ప్రవాహాల ప్రభావాల్లో పడికొట్టుకుపోతున్నాం. పూర్వంలాగా మందలిచ్చి చెప్పే పెద్దవాళ్ళు లేరు. గత చరిత్రని చెప్పే పుస్తకాలు అందుబాటులో లేవు. ఉన్నా చదివే తీరికలేదు. బిజీ బిజీ టెన్షన్ టెన్షన్.

పరిగెత్తే ప్రవాహం వేగంతో దాంపత్య జీవితం క్రమంగా యాంత్రికమైపోవడాన్ని గమనిస్తూ ఏమీ చేయలేని నిస్సహాయత, ఏం చేయాలో తెలియని అయోమయం. పంతాలూ-పట్టింపులూ, కోపాలూ-తాపాలూ, విభేదాలు-విడాకులూ-మానసికంగా దంపతుల మధ్య అగాధాలూ-లోయలూ-ఎవరికి వాళ్ళే కరెక్ట్ అనుకునే తత్త్వం. ఈగోలతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు కోర్టుల్లో ఎక్కువగా ఆస్తి తగాదా కేసులే ఉండేవి. కానీ నేడు కుప్పతెప్పలుగా విడాకుల కేసులు. కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పడ్డాయి. కారణం భార్యాభర్తల మధ్య ఓర్పు, సహనం, సర్దుకుపోయే తత్వం లేకపోవడమే. భార్య, భర్తలు ఇద్దరు ఉద్యోగస్తులు కావడం ఎవరికి వారే గొప్ప అనే అహంభావం పెరిగిపోవడమే చిన్న చిన్న విషయాలకు గొడవపడడం విడిపోవడం. కారణాలేవైనా కావచ్చు. ఇవన్నీ ప్రక్కన పెడితే 'వివాహ బంధం' ఒక పవిత్ర బంధం. ఒక భావన. యుగాలు మారినా హిందూ వివాహానికి ఉన్న ప్రాముఖ్యత ప్రపంచంలో మరెక్కడలేదు. ఏ కులం, ఏ జాతి అయినా, మతం అయినా వివాహ బంధం చెప్పే సూత్రం ఒక్కటే. భార్య, భర్తలిద్దరూ ఒకరినొకరు తెలుసుకుంటూ, సర్దుకుపోతూ, ఒకరినొకరు తోడు, నీడగా అర్ధం చేసుకుంటూ, కష్ట సుఖాలను పంచుకుంటూ చివరి వరకూ...ఒకే మాట - ఒకే బాట - ఒకే భావనగా ఉండాలన్నదే 'వివాహ బంధం' యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## ఉపయుక్త గ్రంథాలు:


1) హిందూ వివాహ పరిచయం గాజుల సత్యనారాయణ

2) ఆచారాలు - సంప్రదాయాలు డా॥ మాచిరాజు వేణుగోపాల్

3) హిందూ సంప్రదాయాలు- గాజుల సత్యనారాయణ

4) మన ఆచారాలు, విలువలు మరియు సంస్కృతీ సంప్రదాయాలు.